# ఎర్రబెల్లి గెలిస్తే రైతుబంధు 16వేలు

- కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధు మాయం
- ఏది కావాలో మీరే తేల్చుకోండి..

- దయాకర్‌రావును చెక్‌డ్యాంల రావు అంటం
- ప్రజలు ఆలోచించి ఓటెయ్యాలె..
- పాలకుర్తి నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్


పాలకుర్తి ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మహబూబాబాద్, నవంబర్ 14(నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలిస్తే రైతుబంధు వస్తుందని, కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధు మాయమవుతుందని ఏది కావాలో తేల్చుకోవాలని సీఎం కేసీఆర్ ప్రజలకు సూచించారు. తొర్రూరు పట్టణంలోని నెల్లికుదురు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం నిర్వహించిన పాలకుర్తి నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు తండోపతండాలుగా తరలివచ్చిన జనాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగించారు. ఎన్నికల్లో నిలబడే అభ్యర్థుల గుణగణాలను చూస్తూనే, అభ్యర్థి వెనుక ఉన్న పార్టీల చరిత్రను చూసి ఓటేయాలని పిలుపునిచ్చారు. 'ప్రభుత్వం మంచిదైతే వచ్చే ఐదేండ్లు ప్రజలకు మంచి అయితది. ఒకవేళ ప్రభుత్వం బాగాలేకుంటే వచ్చే ఐదేండ్లు ఆగమాగమైతది.. మీ గ్రామాలకు, తండాలకు, బస్తీలకు వెళ్లిన తర్వాత నేను చెప్పిన మాటలను చర్చకు పెట్టండి. ప్రలోభాలకు గురై ఓట్లు వేయవద్దు. మీరు వేసే ఓటు మీ తలరాతను మారుస్తుంది. ప్రజలు ఆలోచించి, నిజ నిజాలు గమనించి ఎప్పుడైతే ఓట్లేస్తరో అప్పుడే ప్రజలు గెలుస్తరు. ప్రజలు గెలిసేదే నిజమైన ప్రజాస్వామ్యం. పార్టీల చరిత్ర, నడవడిక చూడాలె. వాళ్లకు అధికారం ఇస్తే ఏం జేసింన్రు, ఏం చేస్తరనేది కూడా చూడాలె' అని విజ్ఞప్తి చేశారు. 'బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ హక్కుల కోసం, తెలంగాణ రాష్ట్రం కోసం, తెలంగాణ ప్రజలను కాపాడడం కోసం. తెలంగాణ వచ్చినప్పుడు పాలకుర్తి ఎట్లా ఉండేదో ఆలోచించాలె. ఇవ్వాల జరిగిన అభివృద్ధిని చూడండి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడక ముందు పాలకుర్తి నుంచి వేలాది మంది బతుక పోయింన్రు. ఇవ్వాల పాలకుర్తికే వేరే రాష్ట్రం వాళ్లు నాట్లేయడానికి, పనిచేయడానికి వస్తా ఉన్నరు. ఉద్యమ సమయంలో పాలకుర్తికి చాలా సార్లు వచ్చిన. ఆరోజు ఎస్సారెస్పీ కాలువల్లో గడ్డి, తుమ్మ చెట్లు మొలిచి, కూలిపోయి ఉండె. నీళ్లొస్తయని ఎవరికీ ఆశలు లేకుండె. ఆనాడు దేవాదుల పూర్తి కాలేదు. తెలంగాణ సాధించుకొని మన ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నాక దేవాదులను పూర్తి చేసి, కాళేశ్వరం కట్టి నీళ్లు తీసుకొస్తే పాలకుర్తిలో లక్షా ముప్పై ఐదు వేల ఎకరాలకు నీరంది అద్భుతమైన పంట పండుతున్నది. ఇవ్వాల బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా ఇస్తున్నది. పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి రైతుబంధు దుబారా అంటున్నడు. దయాకర్ రావు గెలిస్తే రైతుబంధు రూ.16 వేలు అయితది. కాంగ్రెస్ గెలిస్తే రైతు బంధు మాయమైతది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డేమో రైతులకు 3 గంటల కరెంటు చాలంటున్నడు. పీసీసీ అధ్యక్షుడే 3 గంటల కరెంటు చాలని బల్ల గుద్ది చెబుతున్నడు. కేసీఆర్‌కు ఏం తెల్వది, 10 హెచ్‌పీ మోటరు పెట్టుకుంటే గంటకు ఎకరం పొలం పారుతది.. మూడు గంటలు చాలు అంటుండు. ఆగమాగమై ఓట్లు వేస్తే ఆ తర్వాత కేసీఆర్ కూడా ఏం చేయలేడు. మీ తండాలకు, గ్రామాలకు సీసీ రోడ్లు, బీటీ రోడ్లు బాగుచెయ్యడానికి పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా దయాకర్ రావు ఎంతో కృషి చేసిండు. మిషన్ భగీరథ మంత్రి కూడా దయాకర్ రావే. నల్లా నీళ్లు వచ్చేలా చూస్తున్నడు. ఇవ్వాల నీళ్ల బాధ లేకుండా చేసినం. మా తండాలో మా రాజ్యం కావాలని గిరిజనులు దశాబ్దాల తరబడి కొట్లాడితే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందా?. ఇవ్వాల బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పాలకుర్తి నియోజకవర్గంలో 49 గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. గిరిజన బిడ్డలే సర్పంచులై రాజ్యమేలుతున్నరు. గిరిజనుల రిజర్వేషన్లను పెంచుకున్నం. దళిత బంధు మాదిరిగా భూమి, ఉద్యోగం, ఆసరా లేకుండా ఉన్న గిరిజన బిడ్డలందరికీ 'గిరిజన బంధు'ను తప్పకుండా అమలు చేస్తాం. దళిత బంధు అనే పథకాన్ని పుట్టించిందే కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ. విడుతలవారీగా అందరికీ తప్పకుండా వస్తుందని మనవి చేస్తున్నా. దయాకర్ రావును గెలిపించండి. పాలకుర్తికి ఇంజినీరింగ్ కాలేజీ ఉరికురికి వస్తది. పాలకుర్తి నియోజకవర్గంలో పేదలు, దళితులు, గిరిజనులు ఎక్కువగా ఉన్నరు కాబట్టి దయాకర్ రావు కోరిక మేరకు మొదటి రెండేండ్లలోనే ప్రతి గ్రామానికి వంద, వంద యాభై ఇండ్లను మంజూరు చేస్తా. మీ అభ్యర్థి పేరు దయాకర్ రావు కాదు..చెక్ డ్యాంల రావు అని పేరు పెట్టాం. చెక్ డ్యాంల ఏర్పాటుతో భూగర్భ జలాలు పెరిగినయ్. బోర్లు అద్భుతంగా నీళ్లనిస్తున్నయ్. దేవాదాయ భూములు, మండలాలు.. ఇంకా చిన్న చిన్న పనులన్నీ ఈజీగా చేసుకుందాం. ఇది పోరాటాల పురిటి గడ్డ. పోతన గారు పుట్టినటువంటి గడ్డ. బందగీ, దొడ్డి కొంరయ్య, చాకలి ఐలమ్మ కూడా పుట్టిన గడ్డ. మీరందరూ పోరాటానికి వారసులు. నవంబర్ 30న దయాకర్‌రావు గెలిచిన తర్వాత జోరు గా సీటీలు కొడుదాం. నేను చెప్పిన విషయాలు మన బతుకులకు సంబంధించినవి. మంచిగ ఉన్న తెలంగాణను నాడు చెడగొట్టిందే కాంగ్రెస్ పార్టీ కాదా. ఆనాడు మనమంతా గొడగొడ ఏడ్చినం. చివరకు పశువులకు గడ్డి లేకుంటే సాదుకోలేక కబేళాలకు అమ్ముకున్న పరిస్థితి. ఎట్లా ఉండె కరెంటు.. రాత్రిపూట జరసేపు, పొద్దాక జరసేపు, అది పెట్టబోయి పాములు కరిచి చచ్చిపోవడం లాంటి బాధలన్నీ ఇవ్వాల పోగొట్టినం. నిన్నియ్యాల్నే కొంచం కొంచం మొఖం తెలివైతావున్నం. ఈ మొఖం తెలివయ్యి తెలంగాణ మరింత తెలివికి రావాలె గానీ మనం ఇంక వెనకకు పోవద్దు. పాలకుర్తిలో ఏం జరుగుతుందో నాకు తెలుసు. అమెరికా నుంచి విమానంల వచ్చి ఐదు రోజులు మురిపించేటోళ్లు మనకు రేపు నెత్తిల కిరీటం పెడుతరా.. టోపీ పెట్టి మల్ల విమానం ఎక్కుతరు తప్ప ఇక్కడ ఉండరు. కరోనా వచ్చినా.. ఇంకోటి వచ్చినా.. పొద్దాక, తెల్లందాకా మీ మధ్యన ఉండి మీ కోసం తన్లాడే వ్యక్తి దయాకర్ రావు. ఆయనను గెలిపించుకుంటే వంద శాతం మళ్ల మన గవర్నమెంటే వస్తది. పాలకుర్తి సమావేశంలో దాదాపు లక్షమంది కనుచూపు మేరలో కనిపిస్తా ఉన్నరు. మన తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టే పార్టీ, తెలంగాణ కోసం ప్రాణాలియ్యడానికి సిద్ధపడ్డ పార్టీ, వందల మంది బలై తెలంగాణ తెచ్చిన పార్టీ బీఆర్‌ఎస్ పార్టీ. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, యువకులు ప్రతి ఒక్క ఓటును పోల్ చేయించి, పార్టీ గెలుపు కోసం పనిచేయాలి. కారు గుర్తుకే ఓటేసి, బీఆర్‌ఎస్‌నే గెలిపించాలని మిమ్మల్ని కోరుతావున్నా'నంటూ ముగించారు. సభలో బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, మాజీ స్పీకర్ కే మధుసూదనాచారి, నూకల నరేశ్‌రెడ్డి, ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి, ఎంపీపీలు, జడ్పీటీసీలు, తొర్రూరు మున్సిపల్ పాలకవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు మంత్రి దయాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి సీఎం కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి స్వాగతించారు.

# ఏసీలో ఉండే ఎన్నారై కావాలా..? మీతో ఉండే ఎర్రబెల్లి కావాలా?

- పాలకుర్తి అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించండి
- రెవెన్యూ డివిజన్, ఇంజినీరింగ్ కాలేజీ తీసుకొస్తా..
- తొర్రూరు ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి దయాకర్‌రావు



తొర్రూరు : మోసకారి కాంగ్రెస్ మాటలు నమ్మి గోసపడొద్దు.. అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టాలని అబద్దాల ప్రచారంతో ముందుకొస్తున్న కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. తొర్రూరు సభలో ఆయన మాట్లాడుతూ అమెరికాలో ఉంటూ చుట్టపు చూపుగా ఎన్నికలప్పుడు డబ్బు సంచులతో వచ్చే ఎన్నారైలకు ఇక్కడి ప్రజల కష్టాలు ఏం తెలుస్తాయని ప్రశ్నించారు. ఏసీలో ఉండే వాళ్లు కావాలా? మీతో ఎండలో ఉండి కష్టాసుఖాలు పంచుకునే దయన్న కావాలో తేల్చుకోవాలని సూచించారు. కరోనా కష్టకాలంలో ఈ ఎన్నారై ఇక్కడి ప్రజలను ఏం ఆదుకున్నదో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. ప్రజల కష్టాలు పట్టించుకోని కాంగ్రెస్ అభ్యర్థులు ఇప్పుడు వచ్చి ఏదో చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వేలాది మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ, ఉపాధి అవకాశాలు, 23వేల మంది యువతకు డ్రైవింగ్ లైసెన్సులు, నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ తరగతులు, స్టడీ మెటీరియల్ పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేశామని వివరించారు. అలాగే మిషన్ కాకతీయ, ఎస్సారెస్పీ, దేవాదుల పనులు పూర్తి చేసి చెరువులు నింపామని, ఇప్పటికి 150 గ్రామాలకు నీళ్లు అందించామని మళ్లీ గెలువగానే మిగతా 20 గ్రామాలకు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొర్రూరును రెవెన్యూ డివిజన్‌గా, మున్సిపల్ కేంద్రంగా ఉన్నతీకరించి రూ.200కో ట్లతో అభివృద్ధి చేశామని, 100 పడకల దవాఖానకు శంకుస్థాపన చేశామని తెలిపారు. పాలకుర్తిలో పురాతన ఆలయాలను పునరుద్ధరించామని వల్మిడి, బమ్మెర, పాలకుర్తి ఆలయాల చారిత్రక వైభవాన్ని చాటిచెప్పేలా పర్యటకంగా వన్నె తెచ్చేలా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. దేవరుప్పుల మండలంలోని వాగులపై చెక్‌డ్యాంలు, బ్రిడ్జిల నిర్మాణం, కొడకండ్లలో రూ.100 కోట్లతో మినీ టెక్స్‌టైల్ పార్క్‌ను నిర్మించబోతున్నామని, పెద్దవంగరను మండలంగా ఏర్పాటు చేయించి అభివృద్ధి చేస్తున్నామని, రాయపర్తి మండలకేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయబోతున్నామని, సన్నూరు వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ రూ.15కోట్ల నిధులు మంజూరు చేశారని చెప్పారు. మీకు కష్టం వస్తే మీ దయన్నగా తోడుంటున్నానని చెప్పారు. పాలకుర్తిలో రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను మంజూరు చేశారని, అన్ని గ్రామాలు, తండాల అభివృద్ధికి కృషిచేశానని, రూ.200కోట్ల చెక్‌డ్యాంల నిర్మాణం చేయడంతో ఆకేరు, పాలేరు వాగుల పరివాహక ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావుల్లో జలకళ ఉట్టిపడిందన్నారు. 4వేల డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించామని వివరించారు. ప్రజల ఆశీర్వాదంతో వరుసగా ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచారని, పాలకుర్తి ప్రజలు మరోసారి నిండుమనసుతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదం, పాలకుర్తి ప్రజల ఆదరణతో లక్ష ఓట్ల మెజార్టీతో గెలువబోతున్నానని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తాను గెలువగానే నియోజకవర్గానికి ఒక ఇంజనీరింగ్ కళాశాల, పాలకుర్తిని రెవెన్యూ డివిజన్, రెండు కొత్త మండలాలను ఏర్పాటు చేయాలని, అదనంగా 5వేల ఇండ్లు, సంచార జాతులు, బుడగ జంగాల కులస్తులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు, సన్నూరు వేంకటేశ్వరస్వామి ఆలయ భూముల్లో దశాబ్దాల కాలంగా కాస్తులో ఉండి సాగు చేసుకుంటున్న వారికి పట్టాలిచ్చి రైతు బంధు వర్తింపజేయాలని కేసీఆర్‌ను కోరారు. సంచార జాతులు, బుడగ జంగాలకు తొర్రూరులో రూ.5కోట్లతో భవనాలు నిర్మించబోతున్నామని, ఎన్నికల కోడ్ కారణంగా గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయిందని, ఎన్నికలు పూర్తవగానే కలెక్టర్ ద్వారా కార్డులు ఇప్పిస్తానని తెలిపారు. దయాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపిస్తే ప్రతి గ్రామానికి వంద ఇండ్లను మంజూరు చేస్తానని, ఆయన కోరినవన్నీ నెరవేరుస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.

## ఎర్రబెల్లి గెలుపు ఖాయం

- ఆయన వెంటే నేనున్నా : ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ సుధాకర్‌రావు



తొర్రూరు : ఈ సభకు హాజరైన లక్ష మందిని చూస్తే పాలకుర్తి అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలువడం, రాష్ట్రంలో కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని అర్థమవుతున్నదని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.సుధాకర్‌రావు ధీమాగా చెప్పారు. తొర్రూరు సభలో ఆయన మాట్లాడుతూ.. దయాకర్‌రావు వెంటే నేనున్నానని.. ఆయన గెలుపులో భాగస్వామిగా ఫుల్ సపోర్ట్ చేస్తున్నానని చెప్పారు. కొంతమంది చేస్తున్న అనవసర ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని భారీ మెజార్టీతో దయాకర్‌రావును గెలిపించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో మరోసారి పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో అండగా నిలిచిందన్నారు. సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళలకు రూ.3వేలు, తెల్లరేషన్‌కార్డు ఉన్న వారందరికీ రూ.5లక్షల బీమా, రైతుబంధు, పెన్షన్ల పెంపు వంటి అనేక పథకాలు రాష్ట్ర ప్రజలకు వరంగా మారనున్నాయని పేర్కొన్నారు.

## ప్రజల మనిషి ఎర్రబెల్లిని గెలిపించాలి : మంత్రి సత్యవతిరాథోడ్



తొర్రూరు : ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరుస విజయాలు సాధిస్తున్న నేత, పాలకుర్తి అభివృద్ధి ప్రదాత, ప్రజల మనిషి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ప్రజలు మరోసారి అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి సత్యవతిరాథోడ్ పిలుపునిచ్చారు. తొర్రూరులో సభలో ఆమె మాట్లాడుతూ వేల కోట్లు సంపాదించి ఎన్నికల సమయంలో సీట్లు కొనుక్కుని వచ్చే కాంగ్రెస్ ప్యారాచూట్ లీడర్లతో ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఓడిపోగానే మళ్లీ కంటికి కనిపించని వారిని నమ్మకూడదని కోరారు. ఎంతో రాజకీయ చైతన్యం కలిగిన పాలకుర్తి బిడ్డలు మళ్లీ దయాకర్‌రావును గెలిపిస్తేనే అభివృద్ధి నిరంతరంగా సాగుతుందని, ఈ రోజు మన పల్లెలు, తండాలు బాగుపడ్డాయంటే అది కేసీఆర్ ప్రభుత్వం చేసిన కృషి ఫలితమేనని పదేళ్లుగా తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన కేసీఆర్ ముచ్చటగా మూడోసారి సీఎం కావడం ఖాయమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులందరినీ ఆశీర్వదించాలని కోరారు. ఈ ఉత్సాహాన్ని ఈ నెల 30 వరకు కొనసాగిస్తూ ఓట్ల రూపంలో బీఆర్‌ఎస్‌ను అక్కున చేర్చుకుని ఆదరించాలని సత్యవతి విజ్ఞప్తిచేశారు.

